

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JANUARY-2015**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| **ఆదివారం సాయంత్రం** | : | **6.00** గంటలకు శుభవార్త |
| **బుధవారం సాయంత్రం** | : | **6:30** గంటలకు రక్షణ |
| **గురువారం ఉదయం** | : | **11:00** గంటలకు రక్షణ |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |
| శ్రేష్టమైన జీవితం | : | Better Life |

మంగళ, గురువారాల్లో - ఉదయం **7:30** గంటలకు రక్షణ

బుధ, శుక్రవారాల్లో - ఉదయం **9:30** గంటలకు రక్షణ

ప్రసంగీకులు : పలివెల మణికుమార్

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి

SATYA VANI

P.O.BOX.80, KAKINADA

Pin : 533004

Ph : 0884 -2363722

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH
P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722
Mobile : 9848998547
Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 జనవరి - 2015 సంచిక - 6

## నరకము - నిత్య నాశన స్థలము
(Hell, the Eternal Home of the lost)

దేవుని న్యాయ తీర్పు దినము ఒకటి వచ్చుచున్నదని గత పాఠములో మనము నేర్చుకొని యున్నాము. ఆ దినమందు ఆయన ప్రతివానికి వాని క్రియల చొప్పున తీర్పు తీర్చును. నీతిమంతులను నిత్య జీవమునిచ్చి ఆయన దీవించును. అనీమంతులను నిత్య నరకములో శిక్షించును. యివి నిత్య బహుమానము, నిత్యశిక్ష మరణము (1 యోహాను 3:4; రోమా 6:23). ఇక్కడ చెప్పబడిన మరణము కేవలము భౌతిక మరణము కాదు. అది ఆత్మయొక్క మరణమును, అనగా దేవుని నుండి ఒకడు నిత్యము వేరుచేయబడు స్థితిని గూర్చి చెప్పు చున్నది. పాపులందరు నరకములో పడవేయబడుదురని, నరకము యధార్థమైన ప్రదేశమని బైబిలు చెప్పుచున్నది.

నరకము అను ఈమాట గెహెన్నా అను గ్రీకు పదము నుండి ఉద్భవించినది. ఇదే నరకాగ్ని యని కూడ మన తెలుగు బైబిలునందు చెప్పబడి యున్నది.

మరణానంతరము సంభవించు సంగతులను గూర్చి దేవుడు తన గ్రంథ మందు బయలు పరచినది తప్ప మానవు లెవరు ఏమియును ఎరుగరు. అందు వలన నరకము లేక నరకాగ్నిని గూర్చి పరిశుద్ధాత్ముడు బైబిలునందు ఏమి లిఖించెనో మనము తెలిసికొనుట మంచిది. యేసు క్రీస్తు అగ్నితో బాప్తిస్మ మిచ్చువాడని, అరని అగ్నితో పొట్టును (లేక పాపులను) కాల్చివేయునని బాప్తిస్మ మిచ్చు యోహాను క్రీస్తును గూర్చి పలికెను. (మత్తయి 3:11,12). ఆయన అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని అపొ.పౌలు వ్రాసెను (2 థెస్స 1:7-9).

యేసు ప్రేమస్వరూపి, దయగల దేవుడు, కరుణగల రక్షకుడు అని మనం తలంచుచూ యుంటాము. ఆయన యెడల ఇవన్నియును నిజమే. ఆయన తన ప్రేమను ప్రకటించి నిరూపించెను. అంతే కాదు తీర్పును గూర్చి శిక్షనుగూర్చి, నరకమును గూర్చి మిగిలిన దైవావేశ లేఖకులందరి కంటె ఆయన ఎక్కువ బోధించెను. నరకము అతి భయంకరమైన ఘోర ప్రదేశము. మనము అక్కడకు వెళ్ళకుండు నిమిత్తము ప్రభువు దాని యొక్క తీవ్రతను గూర్చి మనకు తెలియజేసెను. "ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును: మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు". "మరియు ఆత్మను చంప నేరక దేహమునే చంపు వారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింప జేయగల వానికి మిక్కిలి భయపడుడి, యని యేసు బోధించెను (యోహాను 15:6; మత్తయి 10:28). యుగసమాప్తి యందు దేవదూతలు వచ్చి నీతిమంతు లలో నుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును అని మత్తయి 13:49లో ఆయన బోధించెను. యేసుక్రీస్తు చేసిన బోధను మనము చదువుచున్న యెడల అవినీతిపరులు నరకాగ్నిని తప్పించు కొనుట దుర్లభము అని గ్రహించుకొన గలము. వేషధారులైన శాస్త్రులు పరిస య్యులను చూచి ఆయన ఇట్లనెను: "సర్పములారా, సర్పసంతానమా, నరక శిక్షను మీరేలాగు తప్పించు కొందురు? ... భూమి మీద చిందించబడిన నీతి మంతుల రక్తమంతయు మీమీదికి

వచ్చును" (మత్తయి 23: 33-36).

నరకమును గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో మనము ఇప్పుడు గమనించుదాము:

**నరకము నిత్యనాశన ప్రదేశము:**

ఈ జీవితాంతమున దేవునితో జీవించు నిరీక్షణను కోల్పోవు ప్రదేశము అది. ధర్మవిరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరిచేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశముచేత నాశనము చేయును అని 2 థెస్స 2:8లో వ్రాయబడియున్నది. అందుకే 'ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది. దాని ద్వారా ప్రవేశించు వారనేకులు" అని యేసు బోధించెను (మత్తయి 7:13).

నరకము ప్రతిదండన చేయబడు ప్రదేశము: ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయును అని వ్రాయబడి యున్నది. ప్రతి దండన అనగా న్యాయమును తీర్చుట, పగతీర్చుటయను వాటిని సూచించుచున్నది. అందుకే "దేవుని కుమారుని పాదములతో త్రొక్కి తాను పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధనరక్తమును అపవిత్రముగా నెంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎక్కువైన దండనకుపాత్రుడని" హెబ్రీ 10:29లో వ్రాయబడియున్నది.

**నరకము దుర్మార్గులు నిత్యము యాతన, బాధపడు ప్రదేశమై యున్నది:**

యేసు ఒక ధనవంతుని గూర్చి బీదవాడైన లాజరును గూర్చి చెప్పిన సంఘటన లూకా 16వ అధ్యాయములో వ్రాయబడి యున్నది. ధనవంతుడు చనిపోయి పాతాళములో బాధపడుచు... నేను ఈ అగ్ని జ్వాలలలో యాతన పడుచున్నాని కేకలు వేసి చెప్పెను (లూకా 16:23:24). నరకములో మానవులు పడు యాతన నిజమైనది. అది అంతు లేనిది. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 8:21).

**నరకము దేవుని ఉగ్రత కుమ్మరింపబడు ప్రదేశమై యున్నది:**

దేవుడు ప్రేమయై యున్నాడని చెప్పు బైబిలు గ్రంథమే ఆయన దహించు అగ్నియై యున్నాడని చెప్పుచున్నది (హెబ్రీ 12:29). అందువలన జీవముగల దేవుని చేతిలోపడుట భయంకరము (హెబ్రీ 10:31). భేదములు పుట్టించి

సత్యమునకులోబడక దుర్నీతికిలోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును... దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు శ్రమయు వేదనయు కలుగును (రోమా 1:8,9). దేవుని ఉగ్రతకు తాళజాలినవాడెవడును లేడని ప్రకటన 6:15-17లో వ్రాయబడి యున్నది.

నరకము నిత్యము అగ్నితో మండుచుండు ప్రదేశమైయున్నది అది అగ్నిగుండమని మత్తయి 13:42, ప్రకటన 20:15లలో వ్రాయబడి యున్నది. "మనుష్యకుమారుడు తన దూతలను పంపును: వారాయన రాజ్యములో నుండి ఆటంకములను సకలమైన వాటిని, దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురని" యేసు బోధించెను. అది ఆరని అగ్నియని, అగ్ని గంధకములతో మండు గుండమని మత్తయి 9:44,45లోను, ప్రకటన 20:10లోను వ్రాయబడి యున్నది. దాని నుండి పొగ యుగ యుగములులేచునని ప్రకటన 14:11లో వ్రాయబడి యున్నది.

**నరకము కటికి చీకటియైన ప్రదేశము:**

చీకటిని మానవులు సహజముగా ద్వేషించుదురు, దానిని గూర్చి సహజముగా భయపడుదురు. అయితే నరకములో పడవేయబడు వారు వెలుపలి చీకటిలో పడవేయబడుదురు (మత్తయి 25:30). అవినీతిపరులకు దుర్మార్గులకు గాఢాంధకారము నిరంతరము భద్రము చేయబడి యున్నదని యూదా 13లో వ్రాయబడి యున్నది. పాపము చేసిన దేవదూతలను దేవుడు పాతాళలోక మందలి కటిక చీకటిగల బిలముల లోనికి త్రోసి తీర్పుకుకావలిలో యుంచెనని 2 పేతురు 2:4లో వ్రాయబడి యున్నది. నరకము గాఢాంధకార ప్రదేశమనగా దేవుడు బొత్తిగా లేని ప్రదేశము అది. దేవుడు వెలుగైయున్నాడు (యాకోబు 1:17-1 యోహాను 1:5). గనుక దేవుని నుండి బొత్తిగా వేరు చేయబడుట కటిక చీకటిలో యుండుటయే.

నరకమనగా దేవుడిచ్చు నిత్య శిక్ష అనుభవించే ప్రదేశము. దేవుని ఉగ్రత ననుభవించే ప్రదేశము. నిరంతరము యాతనపడే ప్రదేశము. అది రెండవ మరణము (ప్రకటన 20:15).

నరకము ఎవరికొరకు సిద్ధము చేయబడినది? అనే ప్రశ్న మనకు రావచ్చును. ప్రకటన 21:8లో ఇట్లు వ్రాయబడినది: "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంత

కులును, వ్యభిచారులను మాంత్రికు
లును, విగ్రహారాధకులును, అబద్ధికు
లందరును అగ్నిగంధకములతో మండు
గుండములో పాలు పొందుదురు ఇది
రెండవ మరణము". వారికే గాక యేసు
సువార్తకులోబడని వారికి నరకము
తధ్యమని బైబిలు బోధించుచున్నది
(2 థెస్స 1:7-9, రోమా 2:8-9).
సువార్తకులోబడుట యనగా క్రీస్తు
యొక్క మరణ, సమాధి పునరుత్థానము
లకు లోబడుట (1కొరింధి 15:3,4).
క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటయే
క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థా
నములకులోబడుట. ఇంకొక మాటలో
నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన
యెడల సువార్తకులోబడిన వాడవ
గుదువు.

క్రీస్తులో ఉండియు కూడ ఫలము
లు ఫలింపని వానికి, అనగా నిష్ఫలులైన
క్రైస్తవులకు నరకము సిద్ధము చేయబడి
యున్నది. ఎవడైనను నాయందు నిలిచి
యుండని యెడల వాడు తీగవలె బయట
పారవేయబడి యెండిపోవును; మనుష్యు
లు అట్టి వాటిని పోగుజేసి అగ్నిలో
పారవేతురు. అవి కాలిపోవును. నాలో
ఫలింపని ప్రతి తీగెయు తీసి పారవేయ
బడునని యోహాను 15వ అధ్యాయము
లో యేసు బోధించెను.

అపవాదికిని, వాని దూతలకును,
దేవునిపై తిరుగుబాటు చేసిన దూతల
కును నరకము సిద్ధపరచబడి యున్నదని
మత్తయి 25:41; 2 పేతురు 2:4 లో
వ్రాయబడియున్నది.

తీర్పు దినమందు గ్రంథములు
విప్పబడును. ఆగ్రంథములయందు
వ్రాయబడియున్న వాటిని బట్టి మన
క్రియలచొప్పున యేసు ప్రభువు మనకు
తీర్పు తీర్చును. మరియు ఎవని పేరైనను
జీవగ్రంథమందు వ్రాయబడినట్టు
కనబడని యెడల వాడు అగ్ని గుండము
లో పడవేయబడును (ప్రకటన 20:
12-15). నీ పేరు జీవగ్రంథ మందు
న్నదా ? నీవు క్రీస్తుతోను, ఆయన
సంఘముతోను ఉన్న యెడల నీ పేరు
ఆ గ్రంథమందు కనబడును. లేని
యెడల యేసునందు విశ్వాసముంచి,
నీ పాపముల విషయమై మారుమనస్సు
పొంది, క్రీస్తును ఒప్పుకొనుచూ, పాపక్ష
మాపణ నిమిత్తము బాప్తిస్మము పొందు
ము. ఆయన ఇప్పుడు పరిశుద్ధాత్మ
యనువరమును తదనంతరము నిత్యజీవ
కిరీటమును నీకు బహూకరించును.

# ధనవంతుడు, లాజరు
## (The Rich man and Lazarus)
లూకా 16:19-31

**పరిచయము :**

ధనవంతుడు, లాజరును గూర్చిన సందర్భము ఉపమానమా? కాదా? యని బోధకులు, లేఖకులు తర్కించు కొంటారు. అది లూకా సువార్తలో మాత్రమే కన్పడును. అది ఉపమాన మైనను కాక పోయినను యేసు చెప్పిన మాటలు ఉపమానాత్మకమైనవి, చారిత్రా త్మకమైనవి మరియు వర్ణనాత్మకమైనవి.

యేసు చెప్పిన ఉపమానములలో వలె గాక దీనిలో వ్యక్తుల పేర్లు చెప్పబడి నవి. లాజరు, అబ్రాహాము, ధనవంతుడు మొదలగువారు యదార్ధముగా జీవించిన వ్యక్తులు. ధనవంతుడు, లాజరు యొక్క కధనము ద్వారా యేసు ప్రాముఖ్యమైన దైవిక సత్యమును బయలుపరచెను. యేసు చెప్పిన ఈ మాటలు పరిసయ్యులు, సుంకరులు, పాపులు శిష్యులు అందరు వినిరి (లూకా 16:1; 17:1).

దేవుని వలన మనకు అనుగ్ర హించబడిన ధనమును సద్వినియోగము చేయాలి అను అంశము ఈ ఉపమానము యొక్క ముఖ్య ఉద్దేశ్యమై యున్నది. ధనాపేక్ష గల పరిసయ్యుల యొక్క అప హాస్యమునకు జవాబుగా యేసు ఈ ఉపమానము చెప్పెను (లూకా 16:14-15).

ధనవంతుడు, లాజరు యొక్క కధనము మూడు దశలుగా యేసు వివరించారు. మొదటిది, వీరిద్దరు భూమిమీద నివసించిన దృశ్యము. రెండవది ఈ యిద్దరు మనుష్యుల యొక్క మరణము, మూడవది మరణమైన తరువాత వారిద్దరి స్థితి.

**ఉపమానము :**

"ధనవంతుడొకడుండెను. అతడు ఊదారంగు బట్టలును సన్నపునార వస్త్రములును ధరించుకొని ప్రతిదినము బహుగా సుఖపడుచుండువాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. వాడు కురుపులతో నిండినవాడై ధనవంతుని యింటి వాకిటపడియుండి అతని బల్ల మీద నుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొనగోరెను; అంతేకాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి

దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున అనుకొనియున్న లాజరును చూచి, తండ్రివైన అబ్రాహామా, నాయందు కనికరపడి తన వ్రేలి కొనను నీళ్లలో ముంచినా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము. నేను ఈ అగ్ని జ్వాలలలో యాతనపడుచున్నానని కేకలు వేసి చెప్పెను. అందుకు అబ్రాహాము కుమారుడా- నీవు నీజీవితకాల మందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము; ఇప్పుడైతే వాడిక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు. అంతేకాక ఇక్కడ నుండి మీ యొద్దకు దాటగోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడి వారు మా యొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును మీకును మహా అగాధముంచబడి యున్నదని చెప్పెను. అప్పుడతడు- తండ్రీ ఆలాగైతే నాకయిదుగురు సహోదరులున్నారు. వారును ఈవేదన కరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్యమిచ్చుటకై నాతండ్రి యింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను. అందుకు అబ్రాహాము వారి యొద్ద మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనితో చెప్పగా, అతడు తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారి యొద్దకు వెళ్లిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను. అందుకతడు మోషేయు ప్రవక్తలును చెప్పిన మాటలు వారు వినని యెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెను" (లూకా 16:19-31).

ధనవంతుడు, బీదవాడైన లాజరు యొక్క జీవితములు ఈలోకములో యుండగా వేర్వేరుగా యుండెను. ఎలియేజరు అను హెబ్రీ పదము గ్రీకులో లాజరు అని చెప్పబడినది. ఊదారంగు వస్త్రములు రాజ వంశస్థులు, బహుధనవంతులు ధరించేవారు. లూదియ ఊదారంగు పొడిని అమ్మేది. సైనికులు యేసును సిలువవేయక ముందు ఆయనకు ఊదారంగు వస్త్రములు ధరింపజేసి యూదుల రాజని హేళన చేసిరి (మార్కు 15:17-20).

మానవులు ఈలోకంలో జీవించుచుండగా చాలమట్టుకు తమ జీవితములను తాము నడుపుకోగలరు. మరణమయితే ఎవడును అపజాలని ఒక యదార్థము. మరణమునకు అందరు గురియవుదురు (హెబ్రీ 9:27). గొప్ప తీర్పుదినమునకు ముందు మరణమైన తరువాత వారి యాత్మలు ఎక్కడకు పోవునో యేసు మనకు బయలుపరచారు. ఆయన పరమునుండి వచ్చారు

గనుక మరణానంతర జీవితమును గూర్చి ఆయన ఒక్కడు మాత్రమే చెప్పగలరు.

ఈ ఉపమానములో పరిచయము చేయబడిన ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరణించిన తరువాత వారిద్దరి పరిస్థితులు తారుమారైనవి. మరణించగా లాజరును ఎవరు ఘనంగా పాతిపెట్టలేదు. గాని బహుశ ధనవంతుని అంత్యక్రియలు ఆర్భాటముగా జరిగియుండవచ్చును. మరణించిన తరువాత వారిద్దరు ఇకలే కుండా పోలేదు. మరణమైన తరువాత కూడ వారిద్దరు స్మృతికలిగి వివేక యుక్తము గానే యుండిరి.

తదుపరి ధనవంతుడు లాజరు యొక్క ఆత్మలు మృతుల లోకములో భిన్న స్థానములలో యుండెను. ధనవంతుని ఆత్మ నశించిన వారి స్థానములోను, లాజరు యొక్క ఆత్మ రక్షించబడినవారి స్థానములోను యుండెను. నిజానికి ఈలోకంలో గాని రాబోవు లోకములోగాని యుక్తవయస్సు గలవారందరు వుండు రెండే రెండు ఆత్మీయ స్థితులున్నవి. భూమి మీద మనము అంధకార రాజ్యములో గాని లేక వెలుగు రాజ్యములో గాని యుందుము. (కొలస్స 1:13; 1 పేతురు 2:9). మరణమైన తరువాత మనము కటిక చీకటి గల బిలములో (Tartarus) గాని పరదైసులో (Paradise) గాని యుందుము. (లూకా 23:43). మృతుల లోకములో ఈ రెండే స్థావరములున్నవి. గొప్ప తీర్పు జరిగిన తరువాత, ఆత్మలు నిత్య నరకములోగాని నిత్య జీవములో గాని ప్రవేశించును. మరణమైన తరువాత చెడ్డవారి గతి మంచివారి గతి మార్పు లేనిదై నిత్యము వుండును. ఈ రెంటికి మధ్యస్థ స్థితియేమీ లేదు.

ధనవంతుడు మరణించిన వెంటనే యాతనపడు ప్రదేశమునకు కొనిపోబడెను. అది నిత్యనరకము కాదు. అతడు ధనవంతుడైనందుకే అట్లు శిక్షింపబడలేదు. అబ్రాహాము కూడ ధనవంతుడే. ఈ ధనవంతుడు ఇష్టపూర్వకముగా లాజరుకు అన్యాయము చేసి యుండలేదు. అతని గుమ్మము దగ్గరనుండి లాజరును తోలివేయలేదు. గాని అతడు చేసిన పాపమేమిటి? అతడు ఉదాసీనత గల వాడు, స్వార్థపరుడు!.

లాజరు చనిపోయి అబ్రాహాము రొమ్మున అనుకొనుటకు కొనిపోబడెను. భూమిమీద యున్నపుడు అబ్రాహాము పశువులను మందలను గొప్ప ఆస్థిని కలిగియుండెను. ధనము కాదుగాని ధనాశ మానవుల ఆత్మలను నాశనము చేయును (1తిమో 6:6-10). ధనవంతునిధనము అతడు నశించుటకు ఎట్లు కారణము కాదో బీదవాడైన లాజరు యొక్క బీదతనము పరదైసుకు

కారణము కాదు.

మరణమైన తరువాత ధనవంతుని యొక్కయు లాజరు యొక్కయు పరిస్థితులు తారుమారాయెను. ధనవంతుడు భిక్షగాడయ్యాడు. మొదట తాను ఇప్పుడు యాతనపడుచున్నానని మనవి చేసెను. సహాయము కొరకు ప్రార్థించెను. తదుపరి తన సహోదరులను మార్చుటకు అసాధారణమైన కోరిక కోరెను. తనకు నిరాకరించబడిన సహాయము తన సహోదరులకు చేయాలని కోరాడు. ఈ రెండు విషయాల్లోను అతని మనవి నిరాకరించబడెను. తన సహోదరుల యొద్ద "మోషేయు ప్రవక్తలును ఉన్నారని" చెప్పబడెను (లూకా 16:29). మరణించిన తరువాత నశించిన వారు తమవారు కూడ నశించాలని కోరుకొనరు.

ధనవంతుడు లాజరు యొక్క సందర్భము అనేక సంగతులను గూర్చి మనకు తెలియజేయుచున్నది. దేవుని లేఖనములు మృతులలోనుండి లేచిన వారి మాటకంటె శక్తివంతమైనవి. మరణమైన తరువాత మారుమనస్సు పొందినా ప్రయోజనముండదు. మోషే యొక్కయు, ప్రవక్తల యొక్కయు ఉపదేశమును యేసు ఆమోదించారు (లూకా 16:29-31). మరణించిన వారు తమ జ్ఞాపకాలను కలిగేయుందురు. మరణము స్మృతిని నాశనం చేయలేదు, గుర్తింపును రద్దుచేయదు. జ్ఞాపకము చెరిగిపోదు, గమ్యమును మార్చలేదు.

**ముగింపు :**

ఈలోక జీవిత తారతమ్యములు ధనవంతుడు, లాజరు యొక్క సందర్భములో విపులంగా చిత్రీకరించబడినవి. ధనవంతుడు ఊదారంగు వస్త్రములను ధరించుకొనగా, లాజరు కురుపులతో నిండియుండెను. ఒకడు సమృద్ధిలో యుండగా రెండవవాడు అతని బల్లమీద నుండి పడు రొట్టెముక్కల కొరకు ఎదురు చూచుచుండెను. ధనవంతుని ప్రతి కోరిక తీర్చుటకు అనేకమంది సేవకులుండగా, రెండవవాని బాధను కుక్కలు నివృత్తి చేయుచుండెను.

ధనవంతుని, లాజరును ఎవరు వేరు చేసిరి ? వారిద్దరి మధ్య యున్న అగాధమును ఎవరు నిర్ణయించిరి? భూమిమీద తమ జీవన విధానమును బట్టి తమకు తామే వేరుచేసికొనిరి. భూమిమీద యున్నపుడే వారిద్దరిమధ్య అగాధముండెను. మరణములో అది మార్పు చేయబడలేదు, నిత్యమూ ఆయగాధ ముండును.

ధనవంతుడు నిత్యత్వము కొరకు సిద్ధపడలేదని మరణించిన తరువాత గ్రహించాడు. అతని అడుగుజాడలలో యున్న తన కుటుంబసభ్యులు కూడ

చివరకు యాతన పడు ప్రదేశమునకు చేరుకొందు రని గ్రహించుకొన్నాడు. తన కొరకు, తన సహోదరుల కొరకు అర్జించాడు (లూకా 16:24,27). గాని నిరాకరించబడ్డాడు. నిత్యత్వమును గూర్చి నీవు ఆలోచించావా? దానిని గూర్చి తగిన విధముగా సిద్ధపడ్డావా? (2 కొరింథీ 13:5).

- లూయిస్ రష్మోర్

## బలుల యొక్క వివరణ
## (Explanation of the Sacrifices)

### దేవుని బల్యర్పణ పద్ధతి -4

బల్యర్పణ పత్థతిని ధ్యానించుట వలన లేవీయకాండము నుండి మనము గొప్ప పాఠములను నేర్చుకొనగలము. లేవీయకాండమును చదువు వానికి ఒక్కో బలికి పెద్ద వ్యత్యాసము యేమీ లేదని పైకి అని పించును, గాని కొంచెము లోతుగా చదివిన యెడల ప్రతి బలియొక్క విశిష్టతను బైబిలు విద్యార్థి తెలిసికొనగలడు.

మనము ప్రతి బలి అర్పణను స్టడీచేసి, దాని సంస్కారమును, పశువును లేక ధాన్యములను, అవుసరమగు తైలములు వగయిరాలను గమనించుదము. బలుల ద్వారా చేయు ఆరాధనను, బలిలో పాపపరిహారము యొక్క ప్రత్యేకతను గమనించుదము. బలికిని మోషే ధర్మశాస్త్రముకును గొప్ప సంబంధమున్నది. పాపపు బలికిని, అపరాధ అర్పణకును గల వ్యత్యాసమును తెల్పునది ధర్మశాస్త్రమే.

ప్రాథమికంగా ఇశ్రాయేలీయులు అర్పించిన బలుల యొక్క మార్గదర్శిగా లేవీయకాండమున్నది. ఇక్కడ రెండు మినాహాయింపులున్నవి. ఇశ్రాయేలీయులు అర్పించు రెండు గొప్ప బలులు లేవీయకాండములో కనబడవు. ఒకటి పస్కా బలి, దానిని గూర్చి నేర్చుకొనుటకు ఒకడు నిర్గమకాండము 12వ అధ్యాయములోనికి వెళ్లవలెను. రెండవది సంఖ్యాకాండము 19వ అధ్యాయములో చెప్పబడిన యెర్రని పెయ్య బలి, ఈ రెండును మినహా మిగతా అన్ని బలులు లేవీయకాండములో చెప్పబడినవే.

**ప్రాముఖ్యపాఠములు :**

ఈ బలులను గూర్చి మనము నేర్చుకొనే చాలప్రాముఖ్య పాఠములున్నవి. వాటిలో ఇమిడి యున్న వ్యక్తులు వగయిరా కూడ చూడగలము. మరియు ప్రతి బలి దాని ప్రయోజనములో ప్రత్యేకమైనది. అది అర్పింపబడే విధానము (సంస్కారము) వేరైనది, కారణం ప్రత్యేకమైనది.

గనుక ఈ బలులు ఒక దానికి

బదులు ఇంకొకటి అర్పింపబడవని మనము గమనించవలెను. పాపపరిహారార్థబలి స్థానములో సమాధాన బలిపనికి రాదు. ప్రతి బలి ప్రత్యేకమైనది. దాని యొక్క ప్రత్యేక సంస్కారము ప్రత్యేక వర్తమానము కలిగియుండెను. మరల బలి పశువుగాని, అర్పింపబడే వస్తువులుగాని జంతుజాతి నుండి గాని, వృక్షజాతి నుండిగాని ఎంచుకోబడేవి. మరియు ప్రతి బలి ప్రత్యేకమైన పశువును కోరెను. బలి ప్రత్యేకమే కాకుండ అర్పింపబడే జంతువు కూడ ప్రత్యేకమే. జంతు బలులలో రక్తప్రోక్షణ తప్పక యుండును. గనుక ఈ బలులలో ప్రాయశ్చిత్తము అనే అంశము తప్పక ఇమిడియున్నది.

రక్తము చిందింపబడని ఒక విధమైన బలియున్నది. ధర్మశాస్త్రప్రకారము ప్రతి హెబ్రీయుడు తన పొలములోని పంటలో ప్రధమ ఫలమును దేవునికి అర్పించాలి. ఒక్కోసారి వారు ధాన్యమును అర్పించేవారు, కొన్నిసార్లు కోయబడిన వస్తువులనుండి వచ్చిన ద్రవ్యములను అర్పించేవారు. అవి దేవునికి కృతజ్ఞ తార్పణగా అర్పించబడేవి.

**ఇంపైన సువాసన మరియు అతి పరిశుద్ధ బలులు :**

ప్రతి బలియు కూడ ఈ రెండింటిలో ఒకదానికి చెందును. ఆరాధన సంబంధబలులు ఇంపై సువాసన అర్పణలు అని చెప్పబడెను. ఈ పదములు తరుచు వినియోగించబడెను. ప్రాథమికంగా ఒక వ్యక్తి యొక్క భక్తి ఇంపైన సువాసన బలుల యొక్క ఆధారమై యుండెను. ఇంపైన సువాసన బలులు బలిపీఠముపై నుండి పైకి లేచి ఇంపై సువాసనగా దేవునికి అర్పించబడెను. ఆకాశము వైపు లేచే ఆ ధూమములో, అర్పింపబడిన వస్తువు లేక జంతువు సాంబ్రాణి పొగల రూపములో దేవుని దగ్గరకు కొనిపోబడేది. ఆబలి దేవుని సాన్నిధ్యమునకు పొగ రూపమున కొని పోబడేది. ఆ బలి పశువు నాశనము చేయబడుచున్నదని గాని, దహింపబడి పోవుచున్నదని గాని ఊహించేవారు కాదు. గాని అది పొగరూపమున మార్చబడి దేవుని సాన్నిధ్యమునకు ఆయనకు ప్రీతికరముగా యుండుటకు కొనిపోబడుచున్నదని భావించేవారు.

మోషేధర్మశాస్త్ర ప్రకారము బలులు రెండు ప్రత్యేకములుగా యున్నట్లు గమనించగలము. మొదటిది ఆరాధన పద్ధతిసంబంధమైనది. ఇంపైన వాసన గల బలులు. అవి ఇంపైన సువాసన గల సాంబ్రాణిగ పరిగణించబడేవి. జంతువులు ధూపరూపముగా మార్చబడేవి (లేవి 1:9). దేవునికి ప్రీతికరముగా యుండునట్లు అవి దేవుని సాన్నిధ్యములోనికి పైకి పొగరూపమున కొనిపోబడేవి. ఇందులో వాడబడిన పదజాలమును బట్టి అవి దేవునికి ఇంపైన

సువాసనగాయుండెను. ఆరాధన బలులలో మొదటిది దహనబలి. దీని ద్వారా ఇశ్రాయేలీయుడు తన్నుతాను ప్రతిష్టించుకొనేవాడు, తన జీవితాన్నంతటిని దేవునికి ప్రతిష్టించుకొనేవాడు. రెండవది ధాన్యార్పణబలి. దీనిలో ఇశ్రాయేలీయుడు తన పంటలో ప్రథమఫలమును కృతజ్ఞతార్పణముగా దేవునికి సమర్పించేవాడు. దహనబలులను వ్యక్తులు జనాంగము కూడ అర్పించేవారు. అదే రీతిగా ప్రథమఫలములను వ్యక్తులు, జనాంగము కూడ అర్పించేవారు. సువాసన బలులలో మూడవది సమాధాన బలియని చెప్పబడినది, దీనిని ఒక వ్యక్తి గాని, మరియు అతని కుటుంబము గాని అర్పించేవారు కుటుంబ సభ్యులలో ఎవరైనా దేవుని యొద్దకు మరల చేరుకొంటే కుటుంబమంతా ఆనందముతో దీనిని దేవునికి అర్పించేవారు.

సువాసన నిచ్చే బలులన్నిటిలో, ఆరాధించేవాడు దేవునితో సత్సంబంధము గలవాడై తప్పక యుండవలెను. దేవునికి ప్రీతికరమైన ఆరాధన నర్పించుటకు దేవునికి అతనికి గల నిబంధన సంబంధము సరియైనదై యుండవలెను. దేవుని నెరిగిన వారు దేవుని ఆరాధించే గొప్ప ఆధిక్యత కలిగి యున్నవారు. మరియు నిబంధన పూర్వకసంగతులను నెరవేర్చుచు ఆయనను నమ్మకముగా సేవించువారికి ఆరాధించే ఆధిక్యత ఇయ్యబడెను. ఆరాధన గౌరవ ప్రదమైనది మరియు స్వాభావికమైనది. దేవునిని ఆయన పరిశుద్ధతత్వమును ఎరిగిన వారికే అది కేటాయించబడెను.

**పరిహారార్థబలులు :**

తదుపరి వర్ణించబడిన బలులు పరిహారార్ధ బలులని చెప్ప బడియున్నవి. ఒకనికి దేవునితో గల సంబంధములో బీటలు వచ్చినప్పుడు ఈ బలుల కోరబడేవి. దేవునికి చెందవలసిన రీతిగా ఆరాధన చేయకపోయినా, పాపము చేసినా, దేవుని తో గల సహవాసము తెగిపోవును. ఇట్టి సందర్భములో పాపియైన వాడు మొదట పాపపరిహారార్ధబలి అర్పించవలెను. పది ఆజ్ఞలలో మొదటి ఐదు ఆజ్ఞలను ఎవడు మీరెనో అట్టివాని నుండి ఈ పాపపరిహార్ధబలి కోరబడెను. ఆ అయిదు ఆజ్ఞలు దేవుని తత్వాన్ని గూర్చి యున్నట్టివి. గనుక దేవునికి మానవునికి మధ్య గల సంబంధ ఆజ్ఞలను ఒకడు మీరినప్పుడు, వారి సహవాసము తెగిపోవును. గనుక ఆసహవాసమును పునరుద్ధరించుటకు గాను పాపపరిహారార్ధ బలి అర్పించ వలసివచ్చెను.

అపరాధ పరిహారార్ధబలియైతే మానవునికి మానవుని మధ్య గల సంబంధమైన ఆజ్ఞలలో, తదుపరి 5 ఆజ్ఞలలో యున్నది. ఇవియేగాక ఇంకా 613 ఆజ్ఞలు, నిబంధనలు, చట్టములు

ఈయబడెను. ఇశ్రాయేలీయులు వాటన్నిటిని ఆచరింపబద్ధులై యుండిరి. అంతే కాదు ధర్మశాస్త్రములో పదిగాని 613 లో ఏదైనా గాని ఉల్లఘించబడినప్పుడు, వాటిని అతిక్రమించిన వాడు అపరాధపరిహారార్థ బలి తప్పక అర్పింపబాధ్యుడు.

పాపపరిహారార్థబలి స్థానములో అపరాధపరిహారబలి పనికిరాదు. దేవుని తత్వానికి సంబంధించినది పాపపరిహారబలి. దేవుని పాలనకు వ్యతిరేకముగా జరిగించువాటి విషయమై అపరాధ బలిజరుగును. పాపపరిహారబలి దేవునికి మానవునికి మధ్య గల సంబంధమును పునరుద్ధరించును. అపరాధబలి మానవునికి మానవునికి మధ్యగల సంబంధమును పునరుద్ధరించును. మరియు ఇశ్రాయేలీయుల సమాజములో సత్సంబంధమును పునరుద్ధరించును. మరియు సహజముగా దైవ మానవుల సహవాసము కూడ పునరుద్ధరించబడును.

మూడవ గొప్ప పరిహార అర్పణను హెబ్రీ భాషలో యామ్ కిప్పూర్ (Yom Kippur) అని పిలుతురు. యామ్ కిప్పూర్ అనగా పరిహారదినము (Day of Atonement) అని యర్థము. ఆదినమందు పరిచర్యచేయు ప్రధాన యాజకుడు ఒక్కడే ఇశ్రాయేలు జనాంగము నిమిత్తము ఈ పరిహారార్థ బలిని అర్పించును. అది ఇశ్రాయేలు జనాంగము యొక్క బలియేగాక, దానిలో వ్యక్తిగత భావము కూడ ఇమిడి యున్నది.

**దేవునికి కానుకలర్పించుట :**

మోషేధర్మశాస్త్ర ప్రకారము అర్పింపబడే బలులు ప్రాధమికంగా దేవునికి కానుకలు. వాటి ద్వారా దేవుని సంతోషపరచి ఆయన నుండి మేలు పొందుటకు కాంక్షించబడినవి. మానవుడు దేవునికి కానుక నర్పించుసందర్భములో అతడు అగ్నిని కనుగొనినట్లు చెప్పబడినది. పితరుల యుగములో గాని, యూదుల యుగములోగాని మానవుడు దేవుని సంతోషపరచవలెనని ఎప్పుడు తలంచినా, అతడు ఒక బలిపీఠమును కట్టి, కట్టెలు పేర్చి దానిపై అతని అర్పణ నుంచి అగ్ని రాజబెట్టి, ధూమ రూపమున తన అర్పణను దేవుని యొద్దకు పంపించేవాడు. హేబెలు తన అర్పణను దహన బలి రూపమున దేవునికి అర్పించెను.

బలి అను మాట ప్రాధమికంగా అర్పణయని అర్థము. అది దేవునికిచ్చే అర్పణ. అయితే బలి అను ఈమాటలో వ్యక్తిగత త్యాగము కూడ ఇమిడియున్నది. దేనినో కొంతత్యజించి, త్యాగము చేయుట ద్వారా దేవుని కృపనుపొందుదమనే భావము ఇందులో యున్నది. బహుశా దావీదు దీనికి ఆధ్యుడనవచ్చును. 2 సమూయేలు 24:24లో దావీదు, "వెలయియ్యక నేనే తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహన బలిగా అర్పించనని దావీదు రాజు చెప్పెను. అయితే లేవీయకాండము యొక్క ప్రాధమిక ఉద్దేశ్యము వ్యక్తి గత త్యాగము కాదు.

## యేసు అపొస్తలుడు, ప్రధాన యాజకుడు, ప్రవక్త, బోధకుడు, పరిచారకుడు
## (Jesus: Apostle, High Priest, Prophet, Teacher and Servant)

### అపొస్తలుడు, ప్రధాన యాజకుడు
### Apostle, High Priest :

మనము ఒప్పుకొనిన దానికి అపొస్త లుడును, ప్రధాన యాజకుడునైన యేసుమీద లక్ష్యముంచుడి (హెబ్రీ 3:1). దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించి, దానిని రక్షించుటకుగాను అయన కుమారుని పంపెను. దేవునికి ఒకే ఒక్క కుమారుడు గలడు. ఆయన సువార్తికుడు. ఆయన మనుష్య కుమారునిగా ఈ భూలోకములోనికి వచ్చుట ద్వారా దేవుని గొప్ప ప్రేమను బహిర్గతము చేసెను. అంతకు మునుపు గాని, యిప్పటి వరకు గాని అంత గొప్ప ప్రేమను చూపిన వారెవరూ లేరు, ఆయన ఐశ్వర్యవంతుడయ్యు మీ నిమిత్తము దరిద్రుడాయెను. మిమ్మును ఐశ్వర్యవంతులుగా చేయుటకు అయన పేదవాడు కావలసివచ్చెను. అయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింధి 8:9). పరలోక మహిమను విడిచిపెట్టి ఈ భూలోకములో శ్రమలు అనుభవించెను.

### నిజమైన ప్రవక్త (A True Prophet) :

యేసుక్రీస్తు నిజమైన ప్రవక్త, ఆయన వాక్యమును శరీరధారిగా చేసెను. ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్యసంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. (యోహాను 1:14). ఆయన దేవుని మాటలు మాట్లాడుట మాత్రమే గాక ప్రపంచమునకంతకు దేవుని వాక్యమైయున్నారు. అయ్యా ! నీవు ప్రవక్తవని గ్రహించుచున్నానని బావి దగ్గర సమరయ స్త్రీ చెప్పుటలో ఎట్టి సందేహము లేదు (యోహాను 4:19). ఆయన దేవుని యెదుటను ప్రజలందరి యెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండెను (లూకా 24:19) అని ఎమ్మాయికి పోవు శిష్యులాయనను గూర్చి చెప్పుటలో ఆశ్చర్యము లేదు.

జనసమూహములో కొందరు నిజముగా ఈయన ప్రవక్తేయనిరి (యోహాను 7:40). యేసు ఆయన శిష్యులతో ఆయన ప్రవచనములను గూర్చి చెప్పెను. "ఏలయనగా నాయంతట నేనే మాట్లాడలేదు; నేను యేమన వలెనో, యేమి మాట్లాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చి యున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక

నేను చెప్పు సంగతు లను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాననెను" (యోహాను 12: 49-50). మీరు వినుచున్న మాట నా మాట కాదు, నన్ను పంపిన తండ్రిదే (యోహాను 14 : 24). అని చెప్పెను.

**శ్రేష్టమైన బోధకుడు (The Master Teacher) :**

యేసు శ్రేష్టమైన బోధకుడు. ఆయనకు యిహలోక సంబంధమైనయే డిగ్రీలు, పట్టములు లేకపోయినప్పటికిని మనకు తెలిసినంతవరకు ప్రాథమిక విద్యను మాత్రమే అభ్యసించి యుండెను. సమాజమందిర సభలో ప్రాముఖ్యతను కలిగియున్న నికోదేము ఆయనకు రబ్బీ అను బిరుదునిచ్చి దేవుని దగ్గరనుండి పంపబడిన బోధకుడవని ఆయనను గూర్చి చెప్పెను. బోధకుడా, నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరు గుదుము (యోహాను 3:2) అని చెప్పెను. ఈ సందర్భముగా ఆయన యేమియు బదులు చెప్పలేదు గాని నీకోదేముతో ఆయన సంభాషణ కొనసాగించెను. ఆ తరువాత కొన్ని దినములకు ఆయన తన శిష్యుల పాదములను కడుగుచున్నపుడు ఆ బిరుదును ఆమోదించెను. బోధకు డనియు, ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు. నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే (యోహాను 13:13). సువార్తలలో ఆయన బోధలను గూర్చియు, ప్రజలయొక్క ప్రతిస్పందన గూర్చియు సంగతులు గలవు. జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఆయన వారి శాస్త్రులవలె కాక అధికా రముగల వాని వలె వారికి బోధించెను (మత్తయి 7:29). ఈ ప్రపంచములో యెవరూ చేయనట్టి గొప్ప బోధలను ఆయన చేసెను. ఆయన బోధలు వినిన అనేకులు ప్రభావితులై అప్పటి నుండి ఆయనను వెంబడించుటలో ఆకర్షింతు లగుచున్నారు.

**యేసు పరిచారకుడు(Jesus a Servant):**

పరిచారకునిగా యేసు తన్ను తాను ఒప్పుకొనెను. మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనే కులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమును ఇచ్చుటకును వచ్చెననెను (మార్కు 10:45). ఇది చాల పరిచయమైన వాక్యమే అయినప్పటికిని దీనిలో ప్రాముఖ్యమైన భాగము నిర్లక్ష్యము చేయబడుచుండును. యేసు క్రీస్తుదినము లలో "మనుష్య కుమారుడు" అనే మాట చాల ప్రస్తావనకు వచ్చుచుండెడిది. అది మెస్సీయాకు సంబంధించిన బిరుదు. ఏ సమయమందైనను మనుష్య కుమారుడు

వచ్చునని వారు కనిపెట్టుచుండిరి. ఈ విషయమును గూర్చిన ప్రత్యేకతలు యెన్నో గలవు కాని ఒక విషయము మనము గ్రహించవలెను. ప్రతివారు ఒప్పుకునే ఒక ప్రత్యేక విషయమేమంటె మనుష్యకుమారుడు జనాంగముల ద్వారా గౌరవము, అధిపత్యము. అధికారము పొందుననివారి యుద్దేశము. దానియేలు ప్రవచనము చూడండి; సకల జనులును, రాష్ట్రములును, ఆయా భాషలు మాట్లాడు వారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును, మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను (దానియేలు 7:14).

అయితే ప్రభువైన యేసు దాని నంతటిని తారుమారుచేసెను. మీరు పూర్తిగ పొరబడుచున్నారు. మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు. మీరింకను గ్రహింపకున్నారా? (మార్కు 8:31) అని చెప్పెను. మనుష్య కుమారుడు యూదా జనాంగ ములో గొప్ప ఘనతకు సూచనగా యున్నాడు. దేవుని యొక్క పరిచారకుడు గాఢమైన దీనత్వమును వెలిబుచ్చుచున్నాడు. ఈ రెండు విభిన్నమైన మనోభావములను ఆయన జీవితము లోను, బోధలోను ఐక్యపరచి ప్రదర్శించి యున్నాడు.

విందులలో అగ్రస్థానములను, సమాజమందిరములలో అగ్రపీఠము లను, సంతవీధులలో వందనము లును, మనుష్యులచేత బోధకులని పిలువ బడుటను ఆశించు వారిని గూర్చి ప్రభువైన యేసు బహిరంగ ముగ ఖండించినట్లు మనము మత్తయి 23:6 ద్వారా గ్రహించ గలము. బిరుదులు పొందుటకును, ఆధిఖ్యతలు పొందుటకును ప్రభువైన యేసు నిరాకరించెను. "మీరు బోధకులని పిలువ బడవద్దు. ఒక్కడే మీ బోధకుడు. మీరందరు సహోదరులు, భూమి మీద ఎవనికైనను తండ్రియని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి. ఆయన పరలోక మందున్నాడు. మీరు గురువులని పిలువబడ వద్దు, క్రీస్తు ఒక్కడే మీ గురువు. మీలో అందరి కంటె గొప్ప వాడు మీకు పరిచారకుడై యుండవలెను" మత్తయి 23: 8-11). వీటన్నిటికిని ప్రభువైన ఘనత ఆయనకే. అయితే బహుమానముల కంటె, ఘనతకంటె ఆయన పరిచర్యకు యెక్కువ ప్రాధాన్యత నిచ్చెను. క్రీస్తు మాదిరిని సంఘములలో ఈ దినము లలో మనము అనుసరింతమా?

- టామ్ కెల్టన్

# మనుష్యులు నిద్రించుచుండగా
## (While men slept)

మత్తయి 13:24-43లో ప్రభువైన యేసు ఈ ఉపమానము చెప్పారు: "పరలోక రాజ్యము తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. మనుష్యులు నిద్రించు చుండగా అతని శత్రువు వచ్చి గోధుమల మధ్య గురుగులు విత్తి పోయెను. మొలకలు పెరిగి గింజలు పట్టినప్పుడు గురుగులు కూడ అగుపడెను. అప్పుడు ఇంటియజ మానుని దాసులు అతని యొద్దకు వచ్చి అయ్యా నీవు నీ పొలములో మంచి విత్తనము విత్తితివిగదా, అందులో గురుగు లెక్కడ నుండి వచ్చిన వని అడిగిరి. ఇది శత్రువు చేసినపని అని అతడువారితో చెప్పగా, ఆదాసులు - మేము వెళ్లి వాటిని పెరుకుట నీకిష్టమా? అని అతని నడిగిరి. అందుకతడు, వద్దు, గురుగులను పెరుకుచుండగా, వాటితోకూడ ఒక వేళ గోధుమలను పెల్లగింతురు, కోత కాలమువరకు రెంటిని కలిసి యెదుగ నియ్యుడి, కోతకాలమందు ముందుగా గురుగులను కూర్చి వాటిని కాల్చి వేయుటకు కట్టలు కట్టి గోధుమలను నా కొట్టులో చేర్చి పెట్టుడని కోతగాండ్రతో చెప్పుదనెను".

మంచి వారు తమ పనిచే యునంత వరకు సాతాను కనిపెట్టాడు. పొలములో వారు తమపని చేసేసిన తరువాత వాడు మోసపూరితముగా వాని పని ప్రారంభించాడు. నేరుగా తన కుయుక్తి గల పని చేయలేదుగాని మంచితో చెడుగును మిళితము చేయసాగాడు. తత్ఫలితముగా గొప్ప గందరగోళము, గజిబిజి సృష్టించాడు. మంచికి చెడుగు అంత సమీపము గా యున్నందున అది ఆందోళనకరము.

అపవాది యొక్క కుయుక్తిగల అడుగు యేమంటే, అతడు మంచి పనివారు నిద్ర పోవుచుండగా పొలములో గురుగులు విత్తసాగాడు, సాతాను నేరుగా మనలను ఎదుర్కొను నేమో యని మనం కనిపెట్టుచుండగా వాడు వెనుకనుండియే యేకత్తితో పొడుచును. శత్రువు కొరకు మనము బయట వెదుకుచుండగా, అతడు లోపల ఉండియే పనిచేయును.

మన నాయకుడగు యేసు క్రీస్తు అపవాదిని బాగుగాఎరుగును, అందు వలననే ఈయుద్ధము అతి సమీపము నుండియే జరుగునని చెప్పారు. ఎవరెట్టి వారో తెలియబడేవరకు వారు కలిసియే

ఎదుగుదురు. "మనుష్యకుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యము లో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గల వాడు వినునుగాక (మత్తయి 13:41-43).

మంచి వారు నిద్రించుచుండగా విత్తబడిన చెడ్డ విత్తనము వలన నశించిపోవు ఆత్మలను గూర్చి విచారము. దేవుని ప్రజలమైన మనము ఎల్లవేళల మెలకువగా యుండాలి. లేని యెడల సత్యముతో అసత్యము కూడ మిళితము చేయబడ్తాది. రక్షించబడిన వారు నశించిన వారుగా కన్పించును. మంచి వారు చెడ్డ వారు మిళితము చేయబడుదురు. అయితే చెడుగును జరిగించువారికి ప్రభువు రాజ్యములో స్థానము లేదు !.

- అల్‌రిక్ ఎలేయన్

## అగ్నితో వెడలిపోవుట
## (A Fiery Departure)

1 రాజులు గ్రంధములో ఇద్దరు దైవజనులను గూర్చి మనము చదువ గలము. వారు ఏలియా మరియు ఎలీషా అనువారు. అది ఇశ్రాయేలులో గొప్ప కరువుకాలము. మూడున్నర సంవత్స రముల మట్టుకు అక్కడ వర్షము కురియలేదు. నేల అంత ఎండిపోయెను. పశువులు ఆకలితో చచ్చిపోయెను. భూమి గట్టిపడి పోయినందున దున్నుట కూడ కష్టమాయెను.

**వృత్తులలో మార్పులు :**

ఎలీషా వ్యవసాయ దారుడు, ఒక్కదినమందు అతడు 12 జతల యెడ్లతో పొలము దున్నుచుండెను. 12 జతల యెడ్లతో భూమి ఎందుకు దున్నాడంటే - ఒకటి యెద్దులు ఆహారము లేక బక్క చిక్కి యుండెను, రెండు నేల ఆరిపోయి రాయివలె తయారైయుండెను.

ఏలియాస్థానములో పని చేయుటకు ఎలీషాను ఏర్పరచవలసిన దని దేవుడు ఏలియాకు చెప్పి యుండెను. ఒకనొక దినమందు ఎలీషా 12 జతలతో భూమిదున్నుచ

ఏలియాకు కనబడెను. ఏలియా మిత భాషియైనందున అతడు తన దుప్పటిని ఎలీషా మీదకు విసరెను. దాని భావమును ఇద్దరు ఎరిగినవారే, అప్పటినుండి తాను ఏలియా యొక్క పనిలో భాగస్థుడైనట్లు ఎలీషాకు తెలియును. గనుక ఆనాటినుండి అతడు ప్రవక్తయైన ఏలియాతో కలసి పనిచేయు చుండెను. అతడు ఏలియా యొక్క సేవకుడయ్యెను. తద్వారా తాను చేయ వలసిన సంగతులన్నిటిని గూర్చి తెలిసికొనియుండెను.

ఎలిషా ఏలియా యొక్క చేతుల మీద నీళ్లు పోయుచుండువాడని బైబిలు చెప్పుచున్నది (2 రాజులు 3:11). ఒకా నొకప్పుడు గొప్ప కార్యములు చేయగల్గు నట్లు ఎలీషా స్వల్ప సంగతులను కూడ చేయనేర్చుకొన వలసి యుండెను.

స్వల్పకార్యక్రమము :

ఈ యిద్దరు మనుష్యులు దేవుని సేవకొరకై పనికివచ్చు ప్రవక్తలకు శిక్షణ యిచ్చుచుండిరి. ఏలియా, ఎలీషాలు యిద్దరు కనీసం 10 సంవత్సరములు కలిసిపనిచేసిరి. ఒకానొక ఏర్పాటు చేయబడిన దినమందు ఏలియా వెడలి పోవలసి వచ్చెను. ఏలియా బేతెలుకు ఒంటరిగా వెళ్లు చుండెను. గాని "ఎలీషా -యెహోవా జీవముతోడు, నీజీవము తోడు నేనునిన్ను విడువనని చెప్పగా వారిద్దరును బేతేలునకు ప్రయాణము చేసిరి" (2 రాజులు 2:2). ఈయిద్దరు ప్రవక్తలు యొర్దాను నదికి వచ్చువరకు ప్రవక్తల శిష్యులు వారిని కనిపెట్టుచుండిరి. అంతట ఏలియా తన దుప్పటి తీసికొని మడతపెట్టి నీటి మీద కొట్టగా ఆనది ఇవతలకును అవతలకును విడిపోయెను గనుక వారిద్దరు పొడినేల మీద దాటి పోయిరి (2 రాజులు 2:8). ప్రవక్తల శిష్యులు దానిని చూచిరి.

తరువాత ఏలీయా ఎలీషాను చూచి, నేను నీ యొద్దనుండి తీయబడక మునుపు నీ కొరకు నేనేమి చేయుదునో దానినడుగుమని చెప్పెను. ఎలీషా సంకోచించ లేదు. " ఎలీషా, నీకు కలిగిన ఆత్మలో రెండు పాళ్లు నామీదికి వచ్చునట్లు దయచేయుమనెను" (2 : 10). "అందు కతడు నీవడిగినది కష్టతరము గానున్నది. అయితే నీ యొద్ద నుండి తీయబడినప్పుడు నేనునీకు కనబడిన యెడల ఆ ప్రకారము నీకులభించును." అని చెప్పెను. ఎలీషా అధికారము కొరకు, ధనము కొరకు, ప్రఖ్యాతికొరకు అడుగ వచ్చును గాని అతడట్లడుగ లేదు. అతని విజ్ఞాపనలో గొప్ప విజ్ఞానమున్నది.

ఈ దైవజనుని ప్రక్కన అతడు పది సంవత్సరముల మట్టుకు పనిచేసెను. ఏలియా యొక్క పనిని అతడు కొనసాగించాలంటే, ఏలియా కంటె రెట్టింపు శక్తి, ఆత్మ అవసరమని అతడెరుగును. వారిద్దరు కలిసినడుచుచుండగా, ఇదిగో అగ్ని రథమును అగ్ని గుర్రములును కనబడి వీరిద్దరిని వేరుచేసెను. అప్పుడు ఏలియా సుడి గాలి చేత ఆకాశమునకు ఆరోహణమాయెను (2 రాజులు 2 :11). ఏలియా యొక్క దుప్పటి ఎలీషా దగ్గర పడెను. ఎలీషా తన వస్త్రమును రెండుతునకలుగా చేసెను. ఏలియా యొక్క దుప్పటి తన వద్ద యున్నందున తన వస్త్రము ఎలీషాకు ఇప్పుడు అవుసరం లేదు. ఏలియా ప్రవక్త ఆకాశమున కెక్కిపోవుట అతడు చూచి నందున అతని ఆత్మను రెండింతలు తాను పొందినట్లు ఇప్పుడు ఎలీషా ఎరుగును.

ఎలీషా ఆ దుప్పటి పట్టుకొని యొర్దాను నీటిమీద కొట్టెను. ఆనది రెండుగా విడిపోగా, ఎలీషా అవతలి యొడ్డునకు పోయెను. అతని శిష్యులు దీనినంతటిని పరికించిరి గనుక ఏలియా యొక్క రెండింతల ఆత్మను ఎలీషా కలిగి యుండెనని గుర్తెరిగిరి.

- బెట్టీ టక్కర్

**సత్యవాణి టి.వి కార్యక్రమములు :**

| | |
|---|---|
| ప్రతి ఆదివారం సాయం | **6గం॥లకు శుభవార్త** |
| ప్రతి బుధవారం సాయం | **6:30 గంటలకు రక్షణ** |
| ప్రతి గురువారం ఉదయం | **11:00 గం॥లకు రక్షణ** |

www. satyavanicoc.com.

# క్రీస్తు సంఘము, మతశాఖలు

## (The Church and the Denominations)

క్రీస్తు సంఘమునకును వివిధ మతశాఖలకును యున్న వ్యత్యాసమేమి? ఈ వ్యాసములో ఆధునిక మతశాఖలను గూర్చి క్లుప్తముగా తెలిసికొందాము.

తాను వాగ్దానము చేసిన రీతిగా యేసుక్రీస్తు మరణించి, సమాధిచేయబడి పునరుత్థానుడైన తరువాత మొదటిపెంతెకొస్తునాడు తన సంఘమును స్థాపించెను (మత్తయి 16:18, అపో.కా. 2)

కొత్తనిబంధన కాలములో ఒకేఒక్క సంఘముండెను. ప్రతిక్రైస్తవుడు దానిలో సభ్యుడైయుండెను.

ఆ నాటి ఆదిమ క్రైస్తవుల విశ్వాసమునుకు, ఆచరణకు యున్న ఏకైక మార్గదర్శి దేవునివాక్యమే (2యోహాను 9:1పేతురు 4:11:2 తిమో 3:16-17)

క్రీస్తు యొక్క సంఘము మతశాఖకాదని గమనించుము.

ఆదిమ నమూనా నుండి, విశ్వాసము నుండి ప్రజలుతొలగి పోవుదురని ప్రభువు ముందుగానే హెచ్చరించెను.

అట్లే విశ్వాస భ్రష్టత్వము సంభవించెను (1తిమో 4:1, 2తిమోతి 4:2,4, అపో.కా. 20,29,30, 2థెస్స 2:3)

రోమన్ కేథలిక్కు సంఘము అను ఒక సంస్థ ఆదిమ విశ్వాసమునుండి తొలగి పోయిన వారివలన ఉద్భవించెను. అదిక్రీస్తు తన సంఘమును స్థాపించిన కొన్ని శతాబ్దములకు ఆరంభించెను.

రోమన్ కేథలిక్కు సంఘమును సవరించుకుగాను ప్రొటెస్టాంటుల మొదటి డినామిషన్ ఆరంభమాయెను.

కేథలిక్కుల తప్పుడు పద్ధతులను కొన్ని వారు పవరించినను ప్రొటెస్టాంటులు అనేక యితర తప్పుడు పద్ధతులను ప్రవేశపెట్టిరి. అవేవనగా.

- **వందలాది శాఖలు**
- **లేఖన విరుద్ధమైన నామములు**
- **లేఖన విరుద్ధ బోధలు**
- **లేఖన విరుద్ధ పాలనపద్ధతులు**
- **లేఖన విరుద్ధ ఆరాధన**
- **రక్షణ సంకల్పమును సత్యవాక్య ప్రకారము బోధించకపోవుట.**

ప్రజలు మతశాఖల పద్ధతులను విసర్జించి క్రొత్తనిబంధన విశ్వాసమును, ఆచరణను అనుసరించుటకు నిశ్చయించుకొన్న చోట క్రీస్తు సంఘములు నేడున్నాయి. బైబిలు

సంకల్పముకు భిన్నముగా యున్న ప్రతిపద్ధతికి ముము విరోధము, నిజసంఘము మతశాఖ కాదు. దానిని ఎరుగనివారు అదొక మతశాఖయని తలంతురు. ప్రజలు లేఖన విరుద్ధసంగతులను మానవ కల్పితశాఖలను విసర్జించి బైబిలు మార్గము ప్రవేశించాలని వారిని గూర్చి నిరంతరము ప్రయత్నించాలి.

ప్రజల హృదయాలను, ఉద్దేశాలను ప్రశ్నించుట మాపనికాదుగాని ఏయే బోధలు, పద్ధతులు, ఆచారాలు లేఖన విరుద్ధములో మనం తెలిసికోగలము. వాటిని దేవుని వాక్యముతో పోల్చి చూడగా అవి వాక్యవిరుద్ధములని గ్రహించగలము. దేవుని వాక్యానికి విరుద్ధమైనవి దేవునికి విరుద్ధమైనవే! గలతి 1:6-9 చూడుము.

ప్రజలు డినామినేన్లకు అలవాటు పడిపోయినందున, అవి నిజ క్రైస్తవ్యానికి భిన్నమైనవని వారు గ్రహించుకొనుట కష్టము. అందువలన క్రీస్తుసంఘము కూడ ఇంకొక మతశాఖయని వారు భావిస్తారు. గాని :

- సంఘమును క్రీస్తు స్థాపించెను (మత్తయి 16 : 18)
- అదొక డినామినేషన్ కాదు.
- అది కేథలిక్కులదిగాని, ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు.
- దాని ఏకైక విశ్వాస ప్రమాణము బైబిలు మాత్రమే.
- దాని ఆచారపద్ధతులు అన్ని బైబిలును బట్టియే యుండును.
- మానవ పద్ధతులనుగాక బైబిలును మాత్రమే ప్రజలు ఎక్క అనుసరించినా అక్కడ క్రీస్తుసంఘ ముండును.

– దేవిడ్ ఫార్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004